సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



చిరుధాన్యాల సంవత్సరంగా 2023

ఐక్యరాజ్య సమితి 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని జిల్లా వ్యవసాయ అధికారి అన్నారు. - 8లో



రూ. 24 కోట్లతో గ్రంథాలయ వార్షిక బడ్జెట్

వైఎస్సార్ జిల్లా గ్రంథాలయ సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ. 24 కోట్ల బడ్జెట్‌ను రూపొందించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
33.2/16.5

వాతావరణం

జిల్లాలో గురువారం 16.5 – 33.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కంటి అద్దాల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

కడప రూరల్ : పాఠశాల విద్యార్థులకు కంటి అద్దాలు సరఫరా చేసేందుకు సీల్డ్ టెండర్లకు ఆహ్వానం పలుకుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఈ నెల 16వ తేదీలోపు ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల్లోపు రూ.5 వేలు డిమాండ్ డ్రాఫ్టును డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజర్, డీబీసీఎస్, కడప వారికి చెల్లించి టెండరు ఫారాలు పొందాలన్నారు. పూర్తి వివరాలకు 9849376849 నంబరులో సంప్రదించాలన్నారు.

టూరిస్ట్ పోలీసు కార్యాలయం పరిశీలన



టూరిస్ట్ పోలీస్ కార్యాలయం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న వైఎస్సార్ జిల్లా ఎస్పీ అన్బురాజన్

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీసు కార్యాలయాన్ని గురువారం వైఎస్సార్ జిల్లా ఎస్పీ కే.కే.ఎన్ అన్బురాజన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడ నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల గురించి సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానిక ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని అకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో మొక్కలు పెంచాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల సమన్వయంతో నాటుసారా, మద్యం, ఇసుక అక్రమ రవాణాలను అరికట్టేందుకు దాడులు ముమ్మరం చేయాలన్నారు. మహిళల భద్రతకు పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన 'దిశ' యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావు, సిద్దవటం ఎస్ఐ తులసి నాగప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమూల్ పాలసేకరణ ధర నాలుగోసారి పెంపు



రాజేంద్ర ప్రసాద్

కురబలకోట: జగనన్న పాల వెల్లువ పథకం కింద అమూల్ పాల సేకరణ ధర వరుసగా నాలుగోసారి పెంచినట్లు అమూల్ రాష్ట్ర ఆపరేషన్స్ హెడ్ రాజేంద్రప్రసాద్ గురువారం వెల్లడించారు. శనివారం నుంచి ఇవి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆవుపాలు సగటున లీటర్‌కు రూ.32.13 చెల్లిస్తున్నారు. పెంచిన ధర ప్రకారం ఇక నుంచి రూ.34.59 చెల్లిస్తారని తెలిపారు. లీటర్‌కు రూ. 2.46 పెరిగింది. గేదె పాలు ప్రస్తుతం రూ. 44.97 ఉండగా రూ.45.96కు పెంచారు. లీటర్‌కు అదనంగా 0.99 పెంచినట్లైంది. అన్నమయ్య, వైఎస్సార్ కడప, చిత్తూరు, శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో ఈ ధరలు పెంచినట్లు చెప్పారు. ఈ పెంపుతో ఈ జిల్లాల్లో 11 వేల మంది పాల ఉత్పత్తిదారులు ప్రయోజనం పొందుతారన్నారు. ప్రతి ఏటా దీపావళి సందర్భంగా 180 రోజులు పాలు పోసిన వారికి లీటర్‌కు అర్ధరూపాయి చొప్పున బోనస్‌ను వారి ఖాతాలకు జమ చేస్తున్నట్లు వివరించారు. 2021లో 3610 మంది పాడి రైతులకు రూ.25,59, 119, గత ఏడాది 6880 మందికి రూ. 70, 77,772 బోనస్ చెల్లించామన్నారు. ప్రస్తుతం కైరా అమూల్ డైయిరీ వైఎస్సార్ కడప,శ్రీ సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రోజుకి 70 వేల లీటర్లు పాల సేకరణ చేస్తోందన్నారు. వీటిలో అన్నమయ్య జిల్లా 30 వేల లీటర్లతో ప్రథమ స్థానంలో ఉందన్నారు.

గొంతు నొక్కేస్తున్నారు..

రాయలసీమ జిల్లాల్లోనే అతి పెద్దదైన కడప ఆకాశవాణి కేంద్రంపై కేంద్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. క్లస్టర్ల విభజన పేరుతో ఈ కేంద్రం గొంతు నొక్కే చర్యలకు పాల్పడుతోంది. ఇప్పటికే సిబ్బందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేసిన ప్రభుత్వం ఇక ప్రసారాలపై కూడా తన ప్రతాపం చూపబోతోంది. రాయలసీమ ప్రాంత చారిత్రక వైభవం మసకబారే ప్రమాదం ఉందని మేధావులు, సాహితీవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- డిజిటలైజేషన్ పేరుతో ఏపీలో విజయవాడ, విశాఖపట్నం కేంద్రాలుగా క్లస్టర్ల ఏర్పాటు
- 59 ఏళ్లుగా ఉన్న కడప కేంద్రం విజయవాడ క్లస్టర్‌లో విలీనం
- రాయలసీమను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం
- ప్రాంతీయ అసమానత, అన్యాయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మేధావులు, సాహితీవేత్తలు



కడప ఆకాశవాణి కేంద్రం

సాక్షి ప్రతినిధి, కడప: కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా కడప రేడియో స్టేషన్ పరిస్థితి నెలకొంది. మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సమాచార, ప్రసార మాధ్యమాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆకాశవాణి కేంద్రాలను నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతోంది. ఫలితంగా రాయలసీమ ప్రాంతంలోని భాష, యాస ప్రశ్నార్థకం కానుండటంతో పాటు రాయలసీమ అస్తిత్వానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. కేంద్ర ప్రభుత్వం పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని ఆకాశవాణి కేంద్రాలను క్లస్టర్లుగా విభజిస్తోంది. ఈ నేపథ్యంలో రాయలసీమలోనే అతి పెద్దది, 59ఏళ్ల క్రితం ఏర్పడిన ఆకాశవాణి కడప కేంద్రాన్ని క్లస్టర్‌గా మార్చే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఆ విషయాన్ని విస్మరించింది. డిజిటలైజేషన్, అధునాతన సాంకేతికతను స్వీకరించడంలో భాగంగా, ఆయా రాష్ట్రాల్లోని రేడియోస్టేషన్లను 'క్లస్టర్లు'గా ఏర్పాటు చేశారు. ప్రతి క్లస్టర్ దాని పరిధిలోని స్టేషన్ల కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది. కాగా ఏపీలో మూడు ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తూ మూడు ప్రాంతీయ స్టేషన్లు బలంగా ఉన్నాయి. విశాఖపట్నం, విజయవాడతో పాటు రాయలసీమలో కడప కేంద్రం పెద్ద స్టేషన్లు. క్లస్టర్ల విభజనలో ఉత్తరాంధ్ర పరిధిలో విశాఖపట్నం, కోస్తా పరిధిలో విజయవాడను క్లస్టర్‌గా విభజించిన ప్రభుత్వం రాయలసీమలోని కడపను క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలనే ఆలోచనను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా రాయలసీమలోని అన్ని ఆకాశవాణి కేంద్రాలను విజయవాడ క్లస్టర్ పరిధిలోకి చేర్చడం రాయలసీమ ప్రాంతానికి అన్యాయం చేయడమేనని ఈ ప్రాంత మేధావులు, ఉద్యమకారులు అభిప్రాయపడుతున్నారు.

కార్యక్రమాల ప్రసారంలోనూ..

ఆకాశవాణి కడప కేంద్రం ఆదినుంచి ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ కేంద్రం నుంచి ఎంతోమంది ప్రముఖుల పరిచయాలు, ఈ ప్రాంతానికి చెందిన సాహితీవేత్తల కవితలు, కథానికలు, జానపద సంగీతం, కర్ణాటక సంగీతం ఇలా ఎన్నో కార్యక్రమాలను నాటి నుంచి నేటి వరకు కడప కేంద్రం ప్రసారం చేస్తోంది. మన ప్రాంతానికి చెందిన యాస, భాషతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, చరిత్రను అన్ని వర్గాల ప్రజలకు చేరువ చేయడంలో ఆకాశవాణి కేంద్రం కీలక భూమిక పోషిస్తోంది. అలాంటి ఆకాశవాణి కడప కేంద్రం ప్రస్తుతం క్లస్టర్ల విభజన పుణ్యమా అని తన ఉనికినే కోల్పోయే ప్రమాదంలో పడింది. పరిపాలన వ్యవస్థను విజయవాడ క్లస్టర్ పరిధిలోకి చేర్చిన ప్రభుత్వం ప్రసారాలను కూడా విజయవాడ నుంచి రిలే తీసుకునేలా ముందుకు వెళితే మన ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలకు సమాధి కట్టినట్లేనని పలువురు సాహితీవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాయలసీమ ప్రాంతంలోని అతిపెద్ద రేడియో స్టేషన్ పరిరక్షణ కోసం ఉద్యమించడమంటే మన సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవడమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

▶▶ కడప క్లస్టర్ 9స్టేషన్లకు అనువైన ప్రాంతం..

విజయవాడ క్లస్టర్ కంటే రాయలసీమ క్లస్టర్ ఏర్పాటు చేస్తే ఇక్కడి 9 రేడియో స్టేషన్లకు అనువైన ప్రాంతంగా పలువురు వివరిస్తున్నారు. పైగా అన్ని రకాలైన మౌలిక వసతులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ వాసులకు యోగ్యకరంగా ఉండేందుకు 1963లో కడపలో మీడియం వేవ్ రేడియో స్టేషన్ నెలకొల్పారు. కడప, కర్నూలు, అనంతపురం, తిరుపతి, మార్కాపురం, ఆదోని, ఆళ్లగడ్డ, నంద్యాలతోపాటు, నెల్లూరుతో సహా రాయలసీమలో తొమ్మిది ఎఫ్ఎం రేడియో స్టేషన్లు ఉన్నాయి. వీటన్నింటిని కలిపి కడపను మరో క్లస్టర్‌గా పరిగణించి ఉంటే, ఈ ప్రాంతానికి న్యాయం చేయడమే గాక పరిపాలన, ప్రసారాల విషయంలో సౌలభ్యంగా ఉండేది. 59 ఏళ్లుగా సమర్థవంతంగా నిర్వహిస్తున్న కడప స్టేషన్ నాలుగు జిల్లాలకు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రధాన కేంద్రంగా చెప్పుకోవచ్చు. కడపలో మూడు యూనివర్సిటీలు, మూడు మెడికల్ కాలేజీలు, డెంటల్ కాలేజీ, పదుల సంఖ్యలో ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. వివిధ సంస్థల ప్రాంతీయ కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు, బ్యాంకులు మొదలైనవి ఉన్నాయి. రైల్వే స్టేషన్‌తో పాటు విమానాశ్రయం కూడా ఉంది. అత్యంత ప్రాధాన్యత ఉన్న కడప స్టేషన్‌ను 300 కిలోమీటర్ల పైబడి దూరంలో ఉన్న విజయవాడ క్లస్టర్‌లో కలపడంపై రాయలసీమ వాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కడపలో కొత్త క్లస్టర్ ఏర్పడితే, ఏ విధంగానూ అదనపు భారం పడే అవకాశం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పైగా మరింత సమర్థవంతంగా, సౌకర్యవంతంగా నిర్వహించడానికి సులభతరం కానున్నట్లు రేడియో ప్రియులు వివరిస్తున్నారు.

ఆందోళన చేపడతాం



ఆకాశవాణి కడప కేంద్రాన్ని ప్రసారాల స్థాయికి తెచ్చేందుకు పాతికేళ్లుగా ఎన్నో పోరాటాలు చేశాం. రాయలసీమ నడిబొడ్డులో ఉన్న ఆకాశవాణి కడప కేంద్రాన్ని తరలిస్తే వెనుకబడిన ఇక్కడి అంశాలపై ప్రసారాలు ప్రజలకు అంది వారిని చైతన్య పరిచే అవకాశం కుంటు పడుతుంది. ఈ కేంద్రాన్ని మార్చేందుకు వీలు లేదు. మారిస్తే మేమంతా ఆందోళన కార్యక్రమాలు చేపట్టక తప్పదు.

– షేక్ హుస్సేన్ సత్యాగ్ని, మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ రచయిత

కళాకారులకు అన్యాయం చేయకండి



నేను ఆకాశవాణి ఏ–గ్రేడ్ గాయకురాలిని. ప్రస్తుతం రేడియో కేంద్రం ప్రసార విభాగం తరలిపోతే మాలాంటి కళాకారులతోపాటు ఆ కేంద్రం ఉనికి కూడా కనుమరుగవుతుంది. రాయలసీమలోని నాలాంటి వేలాది మంది కళాకారులను పరిచయం చేసి గుర్తింపునిచ్చిన ఈ కేంద్రాన్ని క్లస్టర్ హెడ్ చేసి యధావిధిగా రికార్డింగులు చేయాలి. మాలాంటి కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వాలి.

– సోమిశెట్టి సరళ, ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా

సీమ సంస్కృతిని పరిరక్షించాలి



ఎంతోమంది కళాకారులు కడప కేంద్రం ద్వారా ఆదరణ పొందుతున్నారు.. రాయలసీమలోనే ప్రధాన ప్రైమరీ స్టేషన్గా చారిత్రకంగా గొప్ప నేపథ్యం ఉన్నది కడప కేంద్రం. అలాంటి కేంద్రాన్ని రిలే కేంద్రంగా మార్చి నిర్వీర్యం చేసే చర్యలకు కేంద్రం పాల్పడటం దుర్మార్గం. మన సీమ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం కవులు, కళాకారులు, మేధావులు, రాయలసీమ ఉద్యమకారులు కదలాల్సిన సమయం ఆసన్నమైంది.

–ఎన్నెస్ ఖలందర్, రచయిత, ప్రొద్దుటూరు

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ తొలి వీసీగా ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- నేడు బాధ్యతల స్వీకరణ



ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం తొలి వైస్ చాన్సలర్‌గా ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్‌ను నియమిస్తూ ఉన్నతవిద్య ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు ఉత్తర్వులు జారీచేశారు. 2020 జనవరి, 7న ఏర్పాటైన ఈ యూనివర్సిటీ తొలి ఓఎస్‌డీ/ఇన్‌చార్జి వీసీగా ఆచార్య డి.విజయ్‌కిశోర్ రెండేళ్లు పనిచేశారు. అనంతరం అప్పటి వైవీయూ వీసీ ఆచార్య మునగల సూర్యకళావతి ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం కర్నూలు అబ్దుల్‌హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఫజుల్ రెహమాన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు చెందిన మెకానికల్ ఇంజినీరింగ్ ఆచార్యులు బానోతు ఆంజనేయప్రసాద్ విశ్వవిద్యాలయ తొలి రెగ్యులర్ వైస్ చాన్సలర్‌గా నియమితులయ్యా రు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

33 ఏళ్ల అనుభవం..

డా.బానోతు ఆంజనేయ ప్రసాద్ అనంతపురం జిల్లా పుట్టపర్తి మండలం నరసింహపల్లి తాండాకు చెందిన బి.ఎల్. నాయక్, బి. గౌరమ్మ దంపతుల కుమారుడైన ఈయన విద్యాభ్యాసం అంతా (బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ) జేఎన్‌టీయూ హైదరాబాద్ లోనే సాగింది. 1989లో జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరిన ఈయన 2003లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2010 నుంచి ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. బీఓఎస్ చైర్మన్‌గా, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్, ఎంసెట్ రీజినల్ కోఆర్డినేటర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా, వైస్ ప్రిన్సిపాల్‌గా, పలు విభాగాలకు డైరెక్టర్‌గా, అధ్యాపక సంఘం కార్యదర్శిగా, డిప్యూటీ వార్డెన్‌గా, పలు బోర్డులకు చైర్మన్‌గా పనిచేసిన పరిపాలన అనుభవం ఉంది. ఈయన పరిశోధన పత్రాలు 47 అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 11 అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లు, 11 జాతీయ కాన్ఫరెన్స్‌ల్లో ఆయన పాల్గొన్నారు. ఈయన వద్ద ఇప్పటికే 5 మంది పీహెచ్‌డీ పూర్తి చేసుకోగా, మరో 8 మంది పీహెచ్‌డీ చేస్తున్నారు. దీంతో పాటు అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్ సభ్యుడిగా, ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ శాశ్వత సభ్యుడిగా ఉండటంతో పాటు పలు కమిటీల్లో సభ్యులుగా కొనసాగుతున్నారు.

'ఆపదమిత్ర'ల సేవలు విలువైనవి : డీపీఓ





సమావేశంలో పాల్గొన్న ఆపద మిత్రలు, మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : విపత్తులు సంభవించిన సమయాల్లో ప్రజలను ఆదుకోవడంలో 'ఆపద మిత్ర'ల సేవలు ఎంతో విలువైనవని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రెండో విడత శిక్షణలో భాగంగా గురువారం డీపీఆర్‌సీ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విపత్తులు దేశ పురోభివృద్ధికి అవరోధంగా మారుతున్నాయన్నారు. వీటిని ఎదుర్కొనే సామర్థ్యం పెంపుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయన్నారు. 'ఆపద మిత్ర' వలంటీర్ల సామర్థ్యాన్ని మరింతగా పెంపొందించేందుకే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాదాలు, అడవుల్లో కార్చిచ్చు, రసాయనిక ప్రమాదాల వంటి విపత్తులను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై ఆపదమిత్రలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఓ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలి

- కలెక్టర్ విజయరామరాజు
- ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం
- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వ హించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఎన్నికల నోడల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు రూము నుంచి కేంద్ర ఎన్నికల కమిషన్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై జేసీ సాయికాంత్‌వర్మ, డీఆర్వో గంగాధర్‌గౌడ్, జిల్లా అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులతో కలిసి కలెక్టర్ వీసీ ద్వారా ఆర్డీఓ, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు.

అదే స్ఫూర్తితో ఎన్నికల నిర్వహణ

గతంలో జిల్లాలో జరిగిన ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో ప్రస్తుతం జరిగే ఎన్నికలను కూడా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, పారదర్శకంగా ఈ ఎన్నికలను నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు.

శిక్షణకు హాజరుకాకపోతే చర్యలు

నిర్దేశించిన తేదీలలో ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల విధులకు నియమించిన అధికారులందరూ తప్పకుండా శిక్షణకు హాజరు కావాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. పోలింగ్ సిబ్బందిని వారి సొంత మండలంలోగానీ, వారు విధులు నిర్వర్తించే మండలంలోగానీ ఎన్నికల విధులు కేటాయించకూడదన్నారు.

నియమ నిబంధనల మేరకు బందోబస్తు

ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. స్ట్రాంగ్ రూము, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కౌంటర్లు, నార్మల్, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలు, తదితర ప్రాంతాల వద్ద నియమ నిబంధనల మేరకు బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరినీ ఉపేక్షించం

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఎవరినీ ఉపేక్షించబోమని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి వీడియో గ్రాఫర్, సూక్ష్మ పరిశీలకులను నియమించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ గతంలో ఎదుర్కొన్న అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలో డూప్లికేషన్, అర్హత లేని వారు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల ఫొటోలను తొలగించాలన్నారు. రాజకీయ నేతల విగ్రహాలను కప్పి ఉంచాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ యదుభూషణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, డీటీసీ మీరా ప్రసాద్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, సీపీఓ వెంత్రావు, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

▶▶ చేనేత వస్త్ర వినియోగాన్ని పెంచాలి



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్: భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు దర్పణం పట్టే చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచి చేనేత కార్మికుల కళను, వారి ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర చేనేత జౌళి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నగరంలోని నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను కలెక్టర్ విజయరామరాజుతోపాటు ఏపీ పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్ పర్సన్ జింకా విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు పలు స్టాల్స్‌ను పరిశీలించి వాటి నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా మగ్గం వృత్తిని, సంప్రదాయ కళనే నమ్ముకుని జీవించే చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో విధాలుగా బాసటగా నిలిచిందన్నారు. ఈనెల 15వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, హ్యాండ్‌లూమ్స్ రీజినల్ డైరెక్టర్ రాజారావు, ఏడీ భీమయ్య, డీసీసీబీ సీఈఓ, ఆప్కో డీఎం ప్రసాద్, జిల్లా చేనేత సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ నిర్మాణ ప్రాంగణం పరిశీలన

జమ్మలమడుగు: సున్నపురాళ్లపల్లె సమీపాన నిర్మిస్తున్న ఏపీ హైగ్రేడ్ ఉక్కు కర్మాగార నిర్మాణ ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, ఏపీ హైగ్రేడ్ స్టీల్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ షణ్ముగం, సంబంధింత అధికారులు గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ, ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ నాగరాజు, తహసీల్దార్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏపీహెచ్ఎస్‌సీ ఎండీ షణ్ముగంతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్

వస్తారా.. రారా!

- నందలూరు రన్నింగ్‌స్టాఫ్ నుంచి సంసిద్ధత లేఖలు కోరిన రైల్వే అధికారులు
- ఎర్రగుంట్ల వెళ్లేందుకు విముఖత చూపుతున్న లోకోపైలెట్లు
- అప్పుడు కాంగ్రెస్..ఇప్పుడు బీజేపీ పాలనలో రైల్వే కేంద్రం నిర్వీర్యం
- పట్టించుకోని కార్మిక సంఘాలు

నందలూరు: బ్రిటీషు రైల్వే పాలకుల నుంచి నందలూరులో కొనసాగుతున్న రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ ఎత్తివేసే దిశగా గుంతకల్ రైల్వే అధికారులు గురువారం మరో అడుగు ముందుకు వేశారు. ఈ నేపథ్యంలో రన్నింగ్‌స్టాఫ్(లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, గార్డు)లకు నందలూరు వదిలివేసి, ఎర్రగుంట్లలో పనిచేసేందుకు సంబంధించి సంసిద్ధత లేఖలను కోరుతూ గుంతకల్ సీనియర్ డీఈఈ(ట్రాఫిక్) నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో నందలూరు క్రూసెంటర్‌లో పనిచేస్తున్న రన్నింగ్‌స్టాఫ్ ఎటుతేల్చుకోలేక ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ అంశం రైల్వే వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

సౌకర్యాల కొరత..

ఎలాంటి సౌకర్యాలు లేని ఎర్రగుంట్లకు నందలూరు క్రూను తీసుకెళ్లేందుకు అధికారులు సర్వప్రయత్నాలు చేస్తున్నారు. బలవంతంగానో, బెదిరింపులతో అయినా క్రూను తీసుకెళ్లే యోచనలో ఉన్నారు. అక్కడ క్రూ నిర్వహణకు అనుకూలం కాదని అధికారులకు తెలిసినా.. బలవంతంగా రన్నింగ్‌స్టాఫ్‌పై విధులు, బాధ్యతలను రుద్దుతున్నారు.

సంసిద్ధత తెలపకుంటే..

రన్నింగ్‌స్టాఫ్‌లో 80శాతం మంది నందలూరు క్రూసెంటర్‌లోనే విధులు నిర్వహించేందుకు సంసిద్ధతగా ఉన్నారు. అయితే సంసిద్ధత లేఖలో అధికారుల నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కక్షసాధింపులకు బలికావాల్సి వస్తుందో నన్న భయాందోళన మరోవైపు నెలకొంది.



బ్రిటీషు రైల్వేపాలకుల నుంచి కొనసాగిన నందలూరు రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్

పట్టించుకోని కార్మిక నేతలు

రైల్వే పరంగా ఇంత అన్యాయం జరుగుతున్నా కార్మిక నేతలు నిద్రావస్థలో ఉన్నారనే వాదన బలంగా వినిస్తోంది. నందలూరు రైల్వే కేంద్రం నిర్వీర్యం కావడానికి గతంలో కాంగ్రెస్, ఇప్పుడు బీజేపీ పాలకులే కారణమన్న విమర్శలున్నాయి.

క్లుప్తంగా

రాయి తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం



విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

చింతకొమ్మదిన్నె: మండలంలోని ఎన్‌టీపీసీ వద్ద నుంచి అక్రమంగా రాయిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మైనింగ్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు.వీటిని చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

20 తులాల బంగారు బిస్కెట్ల చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సంజీవరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని చౌడూరు గ్రామానికి చెందిన ఉమాదేవి ఇంట్లో 20 తులాల బంగారు బిస్కెట్లను దోచుకొని వెళ్లారు. పోలీసుల కథనం మేరకు శ్రీనివాసులు పత్తి పంట సాగు చేశాడు. ఈ క్రమంలో పత్తి విడదీసేందుకు 20 మంది కూలీలు రావడంతో శ్రీనివాసులు, ఆయన భార్య ఉమాదేవి రెండు రోజులుగా పొలానికి వెళతున్నారు. వారి కుమారుడు కిరణ్‌కుమార్ ఇంటి తలుపులు వేసి పక్కనే ఉన్న మరో ఇంట్లో కూర్చొని చదువుకునేవాడు. గురువారం ఉమాదేవి దుస్తులు తీసుకునేందుకు బీరువా తెరవగా అందులోని 20 తులాల రెండు బంగారు బిస్కెట్లు కనిపించలేదు. దీంతో భర్త సూచన మేరకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ సంజీవరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. దుండగులు బీరువా తలుపును వంచి బంగారాన్ని దోచుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. భార్యాభర్తలు పొలానికి వెళ్లినప్పుడు బుధవారం చోరీ జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ. 24 కోట్లతో గ్రంథాలయ వార్షిక బడ్జెట్



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ ఉషారాణి తదితరులు

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా గ్రంథాలయ సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ. 24 కోట్ల బడ్జెట్‌ను రూపొందించారు. గురువారం కడప నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చైర్‌పర్సన్ ఎల్. ఉషారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల ఆధునికీకరణ లక్ష్యంగా ప్రతిపాదనలు రూపొందించామన్నారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ బడ్జెట్ ప్రతిపాదన ప్రవేశపెట్టగా ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల కోసం రూ. 11.30 కోట్లు, కొత్త భవనాల నిర్మాణానికి రూ. 5 కోట్లు, గ్రంథాలయాల మరమ్మతులకు రూ. 20 లక్షలు, ఫర్నీచర్ కోసం రూ. 20 లక్షలు, కొత్త పుస్తకాల కొనుగోలుకు రూ. 1.50 కోట్లు, కంప్యూటర్ల కొనుగోలుకు రూ. 75 లక్షలు, వేసవి శిక్షణా కార్యక్రమాల కోసం రూ. 30 లక్షలుగా ప్రతిపాదించి రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖ సంచాలకులకు ఆమోదం కోసం పంపినట్లు తెలిపారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ ఆజాద్, ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

• జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో కంప్యూటర్ల కొనుగోలుకు సంబంధించి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉషారాణి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రూ. 34 లక్షలతో కంప్యూటర్లు కొనాలని తీర్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్, జిల్లా ఆడిట్ అధికారి మంజులవాణి, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రవీంద్రనాథ్‌రెడ్డిని తొలగించారనడం అబద్ధం

ఏపీఎస్‌ఆర్‌టీసీ డైరెక్టర్ రాజారెడ్డి



మాట్లాడుతున్న ఏ. రాజారెడ్డి, బాబా ఫక్రుద్దీన్

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోషియేషన్ నుంచి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని తొలగించారని చెప్పడం శుద్ధ అబద్ధమని ఏపీఎస్‌ఆర్‌టీసీ/పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ ఏ. రాజారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం కడపలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. బాబా ఫక్రుద్దీన్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆంధ్రజ్యోతిలో ఎమ్మెల్యేను తొలగించారని వార్త రాయడం దారుణమన్నారు. ఇలాంటి తప్పుడు వార్తలు రాయొద్దని హితవు పలికారు. ఆర్టీసీకి రవీంద్రనాథ్‌రెడ్డి 25 ఏళ్లకు పైగా సేవ చేస్తున్నారన్నారు. 2011లో ఏర్పడిన వైఎస్సార్ మజ్దూర్ యూనియన్‌కు ఆయన గౌరవాధ్యక్షునిగా ఉన్నారని, 2020లో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కావడంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. తర్వాత ఏర్పడిన వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోషియేషన్‌కు కూడా గౌరవాధ్యక్షునిగా కొనసాగుతున్నారన్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న 52వేల మంది కార్మికులకు ప్రతినెలా రూ.300కోట్ల జీతభత్యాలు ఇప్పించడంలో, కార్మికులందరినీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ ఉద్యోగులగా గుర్తించడంలో కృషి చేశారన్నారు. ఆర్టీసీకి ప్రభుత్వం నుంచి రూ.10వేల కోట్లు సాయం చేసిన ముఖ్యమంత్రి ప్రపంచంలోనే మరొకరు లేరన్నారు. ఆర్టీసీ కార్మికులు ముఖ్యమంత్రి జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ఆర్టీసీ కార్మికులు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

స్పెషల్ డ్రైవ్‌లో 217 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసులు చేపట్టిన వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై 217 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడిపిన వారిపై 203 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా కార్లు, జీపులు, తదితర వాహన డ్రైవర్లపై 14 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు.

వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం

సిద్దవటం : సిద్దవటం రేంజిలోని సాబ్‌బావి, సాబ్‌మోర అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు గురువారం తాగునీటి సౌకర్యం కల్పించామని రేంజర్ ప్రసాద్ తెలిపారు. గురువారం సాయంత్రం రేంజర్ మాట్లాడుతూ కడప డీఎఫ్‌ఓ ఆదేశాల మేరకు వేసవి కాలంలో అడవిలో ఉన్న వన్యప్రాణులు తాగునీటి కోసం గ్రామాల వద్దకు రాకుండా ట్యాంకర్‌లతో తాగునీటిని అటవీప్రాంతంలో ఉన్న సాసర్ పీట్లలో నింపుతున్నామన్నారు. ప్రతి వారానికి రెండు రోజులు నీరు నింపుతామన్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రజలు అడవికి నిప్పు పెట్టరాదన్నారు. అడవి జంతువులకు ముప్పు వాటిల్లకుండా వాటిని కాపాడేందుకు, అడవులను రక్షించేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. అడవులు ఉండటం వల్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కె. ఓబులేస్, ఎఫ్‌బీఓలు రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, సాబ్‌బావి బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దవటం బీటులోని సాబ్‌బావి అటవీ ప్రాంతంలో సాసర్‌ఫీట్‌లో తాగు నీటిని నింపుతున్న సిబ్బంది

చిరుధాన్యాల సంవత్సరంగా 2023



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

వైవీయూ : అధిక పోషకాలు కలిగి ఉన్న చిరుధాన్యాల సాగు ప్రస్తుతం పెరిగిందని, వీటి ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ చిరుధాన్యాలుగా 2023 సంవత్సరాన్ని ప్రకటించిందని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం కడప నగర పరిధిలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మహిళా రైతులకు చిరుధాన్యాల సాగు, సేంద్రియ వ్యవసాయంపై వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలలో ఉన్న పోషకాల ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ వీరయ్య మాట్లాడుతూ ఆహార ధాన్యాలైన వరి, గోధుమ కంటే ఎన్నో రెట్లు అధికంగా చిరుధాన్యాలు పోషకాలను అందిస్తున్నాయన్నారు. పిండిపదార్థాం, పీచుపదార్థం, కాల్షియం, పాస్పరస్, ఫోలిక్‌ఆమ్లం, ఐరన్, రిబోఫ్లెవిన్ తదితరాలు ఉన్నాయన్నారు. ఏఆర్ఎస్ ముఖ్యశాస్త్రవేత్త శ్రీనివాసాచారి మాట్లాడుతూ ప్రతి 100 గ్రాముల చిరుధాన్యాలలో అత్యధికంగా పీచుపదార్థం, ఖనిజలవణాలు ఉంటాయని వివరించారు. 'ఆత్మ' అధికారి పద్మలత మాట్లాడుతూ చిరుధాన్యాల సాగులో సమస్యలు తక్కువ, నీటి వినియోగం తక్కువని వివరించారు. చిరుధాన్యాలకు కనీస మద్దతు ధరను ప్రభుత్వం క్వింటాకు రూ. 2500/– ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో ఆత్మ అధికారులు మురళీకృష్ణ, విజయలక్ష్మి, రమణారెడ్డి, ప్రశాంతి, పద్మజ, శివశైలజ, వీరనాగిరెడ్డి, మహిళా రైతులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



హోంగార్డ్స్ పరేడ్‌ను పరిశీలిస్తున్న కమాండెంట్ మహేష్‌కుమార్

కడప అర్బన్ : కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానాన్ని గురువారం హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్ పరేడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన దర్బార్ పరేడ్ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ హోంగార్డులు పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంటున్నారన్నారన్నారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్యంపై ప్రత్యే దృష్టి సారించాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. హోంగార్డ్స్ కొన్ని సమస్యలను కమాండెంట్‌కు విన్నవించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తాననీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ రమణయ్య, ఆర్‌ఐలు వీరేష్, సోమశేఖర్ నాయక్, ఆర్ఎస్‌ఐలు, హోంగార్డ్స్ పాల్గొన్నారు.

సిబ్బంది లేక..సేవలు అందక

- అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌లో సిబ్బంది కొరత
- 19 మంది కానిస్టేబుళ్లకు 9 మందే విధుల నిర్వహణ
- శాంతి భద్రతలపై ప్రభావం



ముద్దనూరు పోలీసుస్టేషన్

ముద్దనూరు : స్థానిక పోలీసుస్టేషన్‌లో ప్రధాన అధికారి సర్కిల్ ఇన్‌స్పెక్టర్. ఆయన వారం రోజుల క్రితమే బదిలీ అయ్యారు.నేటి వరకు ఆయన స్థానంలో అధికారిని నియమించలేదు. దీనికి తోడు అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే కానిస్టేబుళ్ల కొరత ఉంది.సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి హోదా కలిగిన పోలీసుస్టేషన్‌లో అవసరమైన సిబ్బంది లేకపోవడంతో శాంతి భద్రతలపై ప్రభావం చూపే అవకాశం ఉందని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.స్థానిక స్టేషన్‌లో మొత్తం 19 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహించాల్సివుండగా ప్రస్తుతం కేవలం 9మంది మాత్రమే ఉండటం గమనార్హం.వారిలో ఇద్దరు కోర్టు విధులకు.మరో ఇద్దరు కంప్యూటర్,మరొకరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్‌ఈబీ) విధులు నిర్వహిస్తుండంతో కేవలం నలుగురు కానిస్టేబుళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. అప్పుడప్పుడు బందోబస్తు..వీఐపీ పర్యటనలకు సిబ్బందిని కేటాయిస్తుండంతో స్టేషన్ సిబ్బంది లేక వెలవెలబోతోందని ఆరోపణలు వస్తున్నాయి.స్థానికంగా జాతీయ రహదారి, రైల్వేస్టేషన్, ఫ్యాక్షన్‌గ్రామాలు ఉండటంతో కానిస్టేబుళ్ల అదనపు విధులు నిర్వహించాల్సివస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి తగినంత మంది సిబ్బందిని కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

కేసీ కెనాల్‌లో గల్లంతైన మృతదేహం లభ్యం



దువ్వూరు : మండల పరిధిలోని ఇడమడక గ్రామం వద్ద బుధవారం కేసీ కెనాల్‌లో గల్లంతైన బాలకృష్ణ (37) అనే వ్యక్తి మృతదేహం గురువారం ఐ.బయనపల్లె వద్ద కేసీ కెనాల్‌లో లభించింది. బాలకృష్ణకు భార్య, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు





చికిత్స పొందుతున్న బాధితులు, నుజ్జునుజ్జయిన ఆటో, ద్విచక్రవాహనం

అట్లూరు : మండల పరిధిలోని కడప–బద్వేలు ప్రధాన రహదారిపై దేవనగర్ సమీపంలో గురువారం రాత్రి ఆటో ద్విచక్ర వాహనం ఢీ కొన్న ఘటనలో ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... మండలంలోని కుంబగిరి పంచాయతీ పరిధి కోనేటిపల్లెకు చెందిన గంపా వెంకటసుబ్బయ్యకు చెందిన ఆటోలో ఎస్ వెంకటాపురం కాలనీకి చెందిన కొందరు మహిళలు బయలుదేరారు. నెల్లూరు జిల్లా నరవాడ ఏరియాలో చీపురుపుల్లలు సేకరించి రాత్రి ఇంటికి వస్తుండగా రైల్వేకోడూరు నియోజకవర్గం చిట్వేలికి చెందిన హరి, వెంకటేష్ అనే యువకులు ద్విచక్రవాహనంపై మద్యం మత్తులో బద్వేలుకు వెళుతూ వేగంగా ఆటోను ఢీ కొట్టారు. ప్రమాదంలో ఆటో, ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు అయ్యాయి. హరి, వెంకటేష్, గంప వెంకటసుబ్బయ్య, నలుగురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితులను బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎద్దుల బండిని ఢీకొన్న టిప్పర్

– ఇద్దరికి గాయాలు, ఎద్దు మృతి



ప్రమాద వివరాలను తెలుసుకుంటున్న ఎస్‌ఐ తిరుపాల్ నాయక్

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులో ఎద్దుల బండిని టిప్పర్ ఢీకొట్టింది. గురువా రం తెల్లవారు జామున జరిగిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి ఎద్దు మృతి ఎందింది. ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లె గ్రామానికి చెందిన ఎస్. ఓబుళరెడ్డి, కుమారుడు నందకిశోర్‌రెడ్డి తమ పొలం వద్దకు ఎద్దుల బండిపై వెళుతుండగా.. గండి వైపు నుంచి టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక ఎద్దు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఎద్దుకు స్వల్ప గాయాలయ్యాయి. బండిపై వెళుతున్న ఇద్దరు రైతులకు స్వల్ప గాయాలయ్యాయని ఎస్‌ఐ వివరించారు. గాయపడిన వారిని స్థానికులు వేంపల్లె ప్రభుత్వాసుపత్రి తరలించారు.

గంగమ్మకు నల్లపూసల దండ వితరణ



నల్లపూసల దండ అందజేస్తున్న ఆంజనేయులు కుటుంబ సభ్యులు

లక్కిరెడ్డిపల్లి : అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ అనంతపురం గంగమ్మకు సుండుపల్లె మండలం, పెద్దబలిజపల్లె గ్రామానికి చెందిన ఆంజనేయులు, ధర్మపత్ని లక్ష్మీ ప్రసన్నలు 30.730 గ్రాముల బంగారాన్ని, రూ. 1,33,490లు విలువజేసే బంగారు నల్లపూసల దండను బహూకరించారు. గురువారం ప్రత్యేక అధికారి రవీంద్రరాజు, చైర్మన్ నరసింహారెడ్డిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఏటా అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హాకీ పోటీల్లో క్రీడాపాఠశాల విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారిణులను అభినందిస్తున్న ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్

కడప స్పోర్ట్స్ : ఇటీవల కాకినాడలో నిర్వహించిన శాప్ లీగ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా బాలుర జట్టు రన్నరప్‌గా నిలిచింది. జిల్లా జట్టుకు క్రీడాపాఠశాల నుంచి కె. చరణ్, జి. చందు, ఎం. శ్రీను, పి. బాలాజీ, ఎస్. మహమ్మద్, భగవాన్‌లు పాల్గొని జిల్లా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. అదే విధంగా బాలికల విభాగంలో ఆరుగురు క్రీడాకారిణులు వారి సొంత జిల్లాలకు ప్రాతినిధ్యం వహించి రాణించారు. ఈ సందర్భంగా వీరిని క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ అభినందించారు. కార్యక్రమంలో శిక్షకులు అనిల్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

బేల్దారి పని చేస్తూ..భవనంపై నుంచి పడి..

కొండాపురం వాసి మృతి



విజయ్ (ఫైల్)

కమలాపురం : స్థానిక క్రాస్ రోడ్డు సమీపంలో సూపర్ మార్కెట్ పక్కన నిర్మాణంలో ఉన్న కొత్త బిల్డింగ్ పై అంతస్తు నుంచి కింద పడి బెల్లం విజయ్ (32) మృతి చెందాడు. మృతుడి పెద్దమ్మ కుమారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొండాపురానికి చెందిన విజయ్ కమలాపురం మండలం జంగంపల్లెలోని తన పెద్దమ్మ వద్ద ఉంటూ బేల్దారి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న బిల్డింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. స్థానికులు సమీపంలోనే ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లగా అక్కడ సిబ్బంది ఎవరూ లేక పోవడంతో సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల కోసం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి చిన్న వయస్సు గల ముగ్గురు కుమారులు ఉన్నారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

పీలేరురూరల్ : జీవితంపై విరక్తిచెంది వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ నరసింహుడు కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని బాలంవారిపల్లెకు చెందిన రాజన్న కుమార్తె వాణి (24)కు నాలుగేళ్ల క్రితం సంబేపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు వెంకటేష్‌తో వివాహమైంది, వీరికి రెండు సంవత్సరాల పాప, తొమ్మిది నెలల బాబు ఉన్నారు. బాబుకు పుట్టినప్పటి నుంచి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో రాయచోటి, పీలేరులోని పలు ఆస్పత్రులలో చూపించారు. పదిహేను రోజుల క్రితం పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉంటోంది. కుమారుడి అనారోగ్యం గురించి తరచూ ఆందోళనకు గురవుతూ బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంటి పక్కన వసారాలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పొలం పనులకు వెళ్లి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు ఉరికి వేలాడుతున్న కుమార్తెను కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

• పట్టుజారితే అంతే..



గుర్రంకొండ : నిండా పదేళ్లు కూడా లేని మైనర్లు.. ఆపైన ద్విచక్రవాహనం ఎక్కారు.అందులోనూ ఒకరిద్దరు కాదు ఏకంగా నలుగురు ఒకే స్కూటర్‌పై షికార్లు కొట్టారు. గుర్రంకొండలో ఇలాంటి దృశ్యాలు నిత్యం కనిపిస్తుంటాయి. ప్రమాదం ఏదైనా జరిగితే పరిస్థితి ఏంటని జనం చర్చించుకుంటున్నారు. అభం శుభం తెలియని చిన్నపిల్లలకు ద్విచక్రవాహనాలిచ్చి ఇలా రోడ్లపై పంపిస్తే సరిగ్గా నడపం చేతకాక ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలు వదిలే సమయంలో మైనర్లు బైక్‌లను వేగంగా రోడ్లపై నడుపుతూ వెళుతుండడం గమనార్హం. గతంలో గుర్రంకొండ పట్టణంలో పదివరకు రోడ్డుప్రమాదాలు జరిగి పలువురు మైనర్లు ఆస్పత్రుల పాలయ్యారు. రోడ్డుప్రమాదాలపై మైనర్లు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు అంటున్నారు.